● అభినందనలు



కుప్పిలి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సెమ్స్ ఒలింపియాడ్ టెస్ట్‌లో ముద్దాడ జెడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 14 మంది విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరిని శనివారం కుప్పిలి సర్పంచ్ ముద్దాడ శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు అరుణ, ఎర్రంనాయుడు, అప్పారావు అభినందించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

● దైవ సంబరం



గార మండలం శిమ్మపేటలో రాజమ్మ, నీలమ్మ, భూలోకమ్మ సంబరాలు శనివారం వేడుకగా జరిగాయి. ఐదేళ్లకొకసారి జరిగే ఈ సంబరాల్లో భాగంగా దానులు, దానురాళ్లు ప్రత్యేక స్థలం వద్దకు వెళ్లి ఉపవాస దీక్ష చేశారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం భూలోకమ్మ దేవత ఉత్సవం నిర్వహిస్తారు.

– గార

● సూర్యనమస్కారాలు



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లిలోని ఆదిత్యుని సన్నిధిలో శనివారం సామూహిక సూర్యనమస్కారాలు నిర్వహించారు. జిల్లా యోగా సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో 108 మంది మహిళలు, బాలికలు ఆసనాలు వేశారు. ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ పాల్గొన్నారు.

–అరసవల్లి /సాక్షి ఫొటోగ్రాఫర్ శ్రీకాకుళం

క్లుప్తంగా

వైభవంగా దీపారాధన



దీపారాధనలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక మొండేటివీధిలోని లక్ష్మీగణపతి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం దీపారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.

ఆత్మను తెలుసుకోవడమే జ్ఞానం



ప్రసంగిస్తున్న నారాయణమూర్తి

శ్రీకాకుళం కల్చరల్: ఆత్మ కోసం తెలుసుకోవడమే నిజమైన జ్ఞానమని డాక్టర్ సనపల నారాయణమూర్తి అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో శంకరాచార్యులు రచించిన వివేకచూడామణిపై శనివారం ప్రసంగించారు. జీవన విధానంలో ఏది నిత్యం, ఏది అసత్యమో తెలుసుకోవలసిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పతంజలి శాస్త్రి, డాక్టర్ మోహనరావు, పి.త్రినాథరావు, ఈశ్వరరావు, వెంకటరావు, చంద్రరావు, గోపాలరావు, సరస్వతి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యం



పాడి ఆవుల యూనిట్‌ను గ్రౌండింగ్ చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ గోపాల్

లావేరు: వైఎస్సార్ చేయూత పథకాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని గోవిందపురం పంచాయతీ సర్పంచ్ పిల్లా రాము అన్నారు. పంచాయతీలో వైఎస్సార్ చేయూత పథకం ద్వారా వచ్చిన డబ్బులతో మహిళలు కొనుగోలు చేసిన పాడి ఆవుల యూనిట్‌ను శనివారం గ్రౌడింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18750 అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ జి.గోపాల్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే కొలువు సులువే



పోటీ పరీక్షల విద్యార్థులతో ఎస్సై రాజేష్

రణస్థలం: అంకితభావంతో కష్టపడి చదివితే ఉద్యోగం తప్పక వస్తుందని, అలాకాకుండా కటాఫ్ తగ్గించండంటూ ధర్నాలు చేస్తే కేసులు తప్పవని జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ అన్నారు. జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో ఏసీఎఫ్ అకాడమీ విద్యార్థులకు శనివారం పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ఎంపిక పోయినా చాలా నోటిఫికేషన్లు వస్తుంటాయని, పట్టుదలతో చదివితే తప్పకుండా ప్రభుత్వ కొలువు వస్తుందని చెప్పారు. తాను జనరల్ కేటగిరీలో ఎస్సై ఉద్యోగం సాధించగలిగానంటే రాత్రింబవళ్లు కష్టపడి చదవడం వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏసీఎఫ్ అకాడమీ శిక్షకుడు పి. శేఖర్, విద్యార్థులు ఉన్నారు.

వన్‌వే ట్రాఫిక్ నిబంధనల అమలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌ఐ మధుసూదనరావు

గార: వత్సవలస రాజమ్మ తల్లి జాతరకు శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రెండో వారం జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అక్కడే రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం సముద్రస్నానాలాచరించి అమ్మవారిని దర్శించుకుంటారు. శ్రీకూర్మం జంక్షన్, తూలుగు మీదుగా వత్సవలస వరకు వన్‌వే ట్రాఫిక్ నిబంధనలు అమలు చేశారు. తిరుగు ప్రయాణంలో శ్రీకూర్మం మీదుగా శ్రీకాకుళం వైపు వాహనాలు వెళ్లాలని పోలీసులు సూచించారు. గార ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు పోలీసులకు తగు సూచనలిచ్చారు.

మత్తు వదిలేలా..!



శ్రీకాకుళం జిల్లా కేంద్ర ఆరంభ పాయింటైన పెద్దపాడు కూడలి వద్ద హోర్డింగ్

- డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా పోలీసుల చర్యలు
- జిల్లాలో పలుచోట్ల హోర్డింగ్‌ల ఏర్పాటు



ఏడురోడ్ల కూడలి సమీపంలో..

శ్రీకాకుళం క్రైమ్ : డ్రగ్స్ (మత్తు) రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇంటర్మీడియెట్.. ఆపైన ఉన్నత చదువులు చదివే విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడి తప్పుదోవ పట్టకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పట్టణాల్లోని ముఖ్య కూడళ్లు, మండల కేంద్రాలు, కళాశాలలు, ముఖ్య ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఫ్లెక్సీ హోర్డింగ్‌లు పెడుతున్నారు. ఎస్పీ జి.ఆర్.రాధిక, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో జేడీ వి.నాగమణి కంఠ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సెబ్ అసిస్టెంట్ కమిషనర్ కె.పి.గోపాల్ ఆధ్వర్యంలోని సెబ్, పోలీసు బృందాలు ఇప్పటివరకు 17 హోర్డింగ్‌లు, 71 యాంటీ డ్రగ్స్ టోల్‌ఫ్రీ పోస్టర్స్ (పరివర్తన) ఏర్పాటు చేశాయి. రెండు నెలలుగా 182 కళాశాలలను గుర్తించి డ్రగ్స్ వాడితే కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డ్రగ్స్‌కు బానిస కావొద్దు.. కన్నవాళ్లకు కడుపుకోతను మిగల్చవద్దు.. డ్రగ్స్ అంటే మరణం.. డ్రగ్స్‌ను తరిమికొడదాం.. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను సాకారం చేద్దాం.. గంజాయి, హాషీస్, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి వంటి సందేశాలు పొందుపరిచారు.

డ్రగ్స్ వాడితే శిక్ష..

వినియోగిస్తే 6 నెలల నుంచి సంవత్సరం శిక్ష పడుతున్నారు. అమ్మితే 10 నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష తప్పదు.

టోల్‌ఫ్రీ నంబర్ 14500 :

పరిసర ప్రాంతాలు, విద్యాసంస్థల్లో డ్రగ్స్ వినియోగించేవారి గురించి సమాచారం ఇవ్వడానికి, ఫిర్యాదు చేయడానికి 14500 టోల్ ఫ్రీ నంబరు వినియోగించవచ్చు. వివరాలు గోప్యంగా ఉంచుతారు.

మరిన్ని హోర్డింగ్‌లు పెట్టిస్తాం

శ్రీకాకుళం పట్టణ సెబ్ పరిధిలో తొమ్మిది హోర్డింగ్‌లు, 17 యాంటీ డ్రగ్స్ టోల్‌ఫ్రీ ఫ్లెక్సీ పోస్టర్స్ ఏర్పాటు చేశాం. హోర్డింగ్స్‌కు కొంత సొమ్ము ప్రభుత్వం భరిస్తుండగా.. ప్రొఫెషనల్ కళాశాలల యాజమాన్యాలు కొన్ని స్వచ్ఛందంగా ముందుకొచ్చాయి. అవసరమైన చోట్ల ఇంకా అవగాహన హోర్డింగ్‌లు పెట్టిస్తాం.

– కె.పి.గోపాల్, అసిస్టెంటు కమిషనర్, ఎస్‌ఈబీ

సాటిలేని గాయకుడు ఘంటసాల



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



పాటలు పాడుతున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: ఎన్నటికీ సాటిలేని గాయకుడిగా ఘంటసాల వెంకటేశ్వరరావు నిలుస్తారని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శనివారం ఘంటసాల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఘంటసాలను స్మరించుకునే అదృష్టం ఈ వేదిక ద్వారా లభించిందన్నారు. ఆయన స్వరం అజరామరమని పేర్కొన్నారు. ఆయన పేరిట నేటి వర్ధమాన గాయకుల కోసం వేదికను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు అప్పన్న గొప్ప వ్యక్తి అని ప్రశంసించారు. ముందుగా మెహెర్ ప్రభాకర్ సారథ్యంలో భరత నాట్య ప్రదర్శన చక్కగా సాగింది. అనంతరం ఘంటసాల స్వరమాధురి కార్యక్రమంలో భాగంగా డాక్టర్ నిక్కు అప్పన్న, కల్యాణం రామ్మోహన్‌రావు, కె.ఎల్.ఎన్.మూర్తి, డాక్టర్ ఇ.ఎస్.సంపత్‌కుమార్ తదితరులు చక్కని గీతాలను వీనుల విందుగా వినిపించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, కళాప్రవీణ బండారు చిట్టిబాబు, వరం చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, వావిలపల్లి జగన్నాథరావు, సురంగి మోహనరావు, జామి భీమశంకర్, అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్‌మీడియా కార్యవర్గాల ప్రకటన

ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం సోషల్ మీడియా కార్యకవర్గాలను శనివారం ప్రకటించింది. ఎచ్చెర్ల మండల కన్వీనర్‌గా గవిరెడ్డి రవికుమార్, కో–కన్వీనర్లుగా చిదపాన గోవిందరెడ్డి, బర్రి లక్ష్మణరావు, దుంప ఈశ్వరరావు, పక్క ఉమామహేశ్వరరావులను నియమించారు.

రణస్థలం: రణస్థలం మండల కన్వీనర్‌గా గొర్లె సురేష్, కో–కన్వీనర్లుగా ఆకుల వరప్రసాద్, క్రితి రవికుమార్, మైలపల్లి చిన్న, కోల హరీష్‌లను నియమించారు.

లావేరు: లావేరు మండల కన్వీనర్ రెడ్డి రమణ, కో–కన్వీనర్లుగా సుంకర రాహుల్, మీసాల జగన్, నాయని లక్ష్మణరెడ్డి, నేదురు భానులను నియమించారు.

జి.సిగడాం : జి.సిగడాం మండల కన్వీనర్‌గా వాంద్రంగి వెంకటేష్, కో–కన్వీనర్లుగా కలిశెట్టి మణికంఠ, మునగపాటి ఆదిత్యవర్మరాజు, ఈసరి తవిటిరాజు, మక్క సాయితేజ నియమితులయ్యారు.

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్ మండల కన్వీనర్‌గా బొత్సిన రాజేష్‌కుమార్, కో–కన్వీనర్లుగా అల్లు అనిల్, ఆర్.రాము, సక్క సోమేష్, మట్ట నగేష్ నియమితులయ్యారు.

● శ్రీకాకుళం టౌన్ కన్వీనర్‌గా రావులాపల్లి సురేంద్ర, కో–కన్వీనర్లుగా నండూరి చందు, నల్లపల్లి భానుప్రసాద్, పుట్రేవు రవిశంకర్, బోనీ ఈశ్వరరావు నియమితులయ్యారు.

● గార మండల కన్వీనర్‌గా గుజ్జల అప్పలరాజు, కో కన్వీనర్లుగా కంచు రవి, ఎం.శేఖర్, సురేష్, ఆరంగి సూర్య నియమితులయ్యారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ కె.రూపలత శనివారం చెప్పారు. పొందూరు మండలం గోకర్ణపల్లిలో ఏడబ్ల్యూహెచ్ ఓసీ కేటగిరి, ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీ తెప్పరేవు ఏడబ్ల్యూహెచ్ ఓసీ కేటగిరి, కొయ్యాం పంచాయతీ పీకేనాయుడుపేటలో ఏడబ్ల్యూహెచ్ ఓసీ కేటగిరీ, దోమాంలో ఏడబ్ల్యూహెచ్ ఓసీ, జి.సిగడాం మండలం సేతుభీమవరం పంచాయతీ జీడీపాలేంలో ఏడబ్ల్యూహెచ్ ఓసీ, సీతంపేట పంచాయతీ నక్కపేటలో ఏడబ్ల్యూహెచ్ ఓసీ, పొందూరు మండలం తుంగపేటలో ఏడబ్ల్యూహెచ్ ఓసీ, పెనుబర్తి పంచాయతీ అల్లాజీపేటలో ఏడబ్ల్యూహెచ్ ఓసీ, రాపాక పంచాయతీ ఇల్లయ్యగారిపేటలో ఏడబ్ల్యూహెచ్ ఓసీ, లక్ష్మీపేటలో ఏడబ్ల్యూహెచ్ ఓసీ, ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయతీ వెంకన్నగారిపేటలో ఏడబ్ల్యూడబ్ల్యూ ఓసీ నియామకాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ నెల 18లోపు దరఖాస్తులు చేసుకోవాలని, శనివారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని చెప్పారు.

జి.సిగడాం: జి.సిగడాం మండలం సీతంపేట పంచాయతీ నక్కపేట, దేవరవలస పంచాయతీ మంగమ్మపేట, సేతుభీమవరం పంచాయతీ గంగన్నదొరపాలెం అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పొందూరు ఐసీడీఎస్ అదనపు పీఓ కూన రూపలత ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు కంకణాలు



విద్యార్థులకు కంకణాలు కడుతున్న కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని మొండేటి వీధిలో లక్ష్మీగణపతి ఆలయం 11వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, నూతన వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, 1008 కలాలు, కంకణాలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మూలమంత్రంతో హవనం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు విద్యార్థులకు పెన్నులు, కంకణాలు ఉచితంగా పంపిణీ చేశారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి క్షీరాభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో గ్రామదేవత ముత్యాలమ్మతల్లి ఆలయ 8వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి నిజరూప దర్శనం, క్షీరాభిషేకాలు జరిగాయి. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

తపాలా ఉపకార వేతనాలకు ముగ్గురు ఎంపిక



ఎం.గౌతమ్



గుర్ల సత్యప్రణీత్



పి.జ్యోత్స్నశ్రీ

శ్రీకాకుళం అర్బన్: తపాలా శాఖ దేశవ్యాప్తంగా 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు దీన్ దయాళ్ స్పార్ష్ యోజన పేరుతో నిర్వహించిన పోటీలో జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు సూపరింటెండెంట్ వి.సత్యనారాయణ శనివారం తెలిపారు. స్టాంపుల సేకరణ, ప్రదర్శన, భద్రపరచడం వంటి అంశాల్లో విద్యార్థులకు ఆసక్తి పెంచడం కోసం తపాలా శాఖ ప్రతి ఏడాది ఈ పోటీ నిర్వహిస్తోందని చెప్పారు. తొలుత జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ ద్వారా కొంతమందిని ఎంపిక చేశామని, వారికి నిర్దేశించిన అంశాల మీద ప్రాజెక్టులు సమర్పించాలని సూచించామని తెలిపారు. అలా వచ్చిన ప్రాజెక్ట్‌ల్లో మెరుగైన వాటిని రాష్ట్ర స్థాయిలో తరగతికి పది చొప్పున ఎంపిక చేశామన్నారు. వారందరికీ నెలకు రూ.500లు చొప్పున ఉపకార వేతనం జమ చేస్తారన్నారు. జిల్లా వరకు 6వ తరగతి కేటగిరీలో సాయి విద్యామందిర్(పి.ఎన్.కాలనీ, శ్రీకాకుళం) విద్యార్థి ఎం.గౌతమ్, 7వ తరగతి విభాగంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ (పాత హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీకాకుళం) విద్యార్థి గుర్ల సత్యప్రణీత్, సాయి విద్యా మందిర్ (పీఎన్ కాలనీ, శ్రీకాకుళం) విద్యార్థిని పి.జ్యోత్స్నశ్రీలు ఎంపికయ్యారని ప్రకటించారు.

ప్రధాన రైళ్లకు హాల్ట్ కల్పించాలి



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జి.సిగడాం: జి.సిగడాం రైల్వేస్టేషన్‌లో ఇంటర్‌సిటీ, విశాఖ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైఎస్సార్ సీపీ మండల నాయకులు బూరాడ వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ కోరారు. ఈ మేరకు శనివారం విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు. గతంలో ఈ స్టేషన్‌లో ఇంటర్‌సిటీ, బ్రహ్మపుత్ర, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టు ఇచ్చేవారని, ప్రయాణికులకు రవాణా సౌకర్యంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరేదన్నారు. తర్వాత నిలిపివేశారని చెప్పారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పెద్ది శ్రీనివాసరావు, చందక సతీస్, చిక్కాల ధర్మారావు, ఇజ్జి తాతారావు, కోరాడ అచ్చెరావు, కొత్రాయి అప్పారావు, ఇజ్జి కోటి, పెద్ది లక్ష్మణరావు, కుమరాపు శ్రీనివాసరావు, చందక మహేశ్వరరావు, ఎం.ఆదిత్యవర్మరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకుడు లంక శ్రీరాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహంతయ్య, ముఠామేస్త్రి, గొర్లె సన్యాసిరావు, పితూరి సత్యం, గొర్లె కన్న, వడ్డాది వరం, పిన్నింటి బంగారప్పడు, లంక సంతు, వలిరెడ్డి సూరి పాల్గొన్నారు.

ప్రజలను మోసగించేందుకే లోకేష్ పాదయాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: జగనన్న ప్రజా సంక్షేమ పాలన చూసి టీడీపీలో వణుకు పుడుతోందని, నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర ప్రజలను మోసం చేయడానికేనని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం జాడ గ్రామంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని, వీటిని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, నాయకులు బూరాడ వెంకటరమణ, జేసీఎస్ డోల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు పెద్ది శ్రీనివాసరావు, అప్పారావు, కోటి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి



గురుగుబిల్లిలో ఈకేవైసీ చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ లక్ష్మణ

లావేరు: ఈ–క్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.మహేష్‌నాయుడు అన్నారు. గురుగుబిల్లి, కేశవరాయునిపురం, లావేటిపాలెం తదితర గ్రామాల్లో శనివారం రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈ–క్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేసుకున్న రైతులతో వేలిముద్రలు వేయించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు ఆధారంగానే రైతులకు పంటల బీమా మంజూరు, ఎరువులు, విత్తనాలు అందజేయడం, పంటలు కొనుగోలు జరుగుతాయని వివరించారు. ఈ క్రాప్‌లో నమోదు చేయించుకున్న అనంతరం రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్ల వద్దకు రైతులు ఆధార్‌కార్డు, ఫోన్ నంబరు వివరాలు తీసుకెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు టి.లక్ష్మణ, ప్రమీల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లావేరు: లావేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈఎస్ బయ్యన్ననాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జి.సిగడాం: మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు జి.సిగడాం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

స్వయం ఉపాధి యూనిట్ పరిశీలన

కొత్తూరు: మెట్టూరు బిట్–3 గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్‌ను నాబార్డు ఏజీఎం వరప్రసాదరావు శనివారం పరిశీలించారు. మినుములు, పెసలు నుంచి తొక్కతీసే యూనిట్‌తో పాటు ధాన్యం మిల్లింగ్ యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరపాడుకు చెందిన 60 మంది మహిళలు జనపనారతో వస్తువుల తయారీపై నాబార్డు సౌజన్యంతో ఇటీవల శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా వస్తువుల తయారీ కోసం షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ శ్రీనివాసరావు ఏజీఎంను కోరారు.